సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 6 । మార్చి । 2025




## భీమడోలు రైల్వే గేటు మూత

భీమడోలు: ఈ నెల 7, 8, 9 తేదీల్లో భీమడోలు జాతర మహోత్సవంలో భాగంగా భీమడోలు రైల్వే గేటు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.



## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ గురువారం (సాయంత్రం) | సహరి శుక్రవారం (ఉదయం) |
|---|---|---|
| భీమవరం | 6.17 | 4.57 |
| నరసాపురం | 6.18 | 4.56 |
| తాడేపల్లిగూడెం | 6.12 | 5.06 |




## హుండీ ఆదాయం రూ.1.10 లక్షలు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమేశ్వర స్వామి దేవస్థానం హుండీలను బుధవారం లెక్కించగా రూ.1,10,922 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి తోట శ్రీనివాస్ తెలిపారు.

# ఈ హామీల మాటేంటి ?

**వంచించి.. విస్మరించి..**

- 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్
- మత్స్యకార భరోసా రూ.20 వేలకు పెంపు
- ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50లకే విద్యుత్
- ఎన్నికల్లో హామీలను గుప్పించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్
- బడ్జెట్ కేటాయింపుల్లో వాటి ప్రస్తావనే లేని వైనం




సాక్షి, భీమవరం: 'ఒడ్డు చేరేదాకా ఓడ మల్లన్న.. ఒడ్డు చేరాక బోడి మల్లన్న' అన్నట్టుగా ఉంది కూటమి తీరు. అధికారమే పరమావధిగా ఎన్నికల్లో కూటమి నేతలు లెక్కలేనన్ని హామీలిచ్చారు. ప్రభుత్వం రావడమే తరువాయి అన్నింటినీ ఆచరణలో పెట్టేస్తామంటూ ఓటర్లను నమ్మించారు. ఈ తొమ్మిది నెలల్లో చేసిందేమీ లేకపోగా పేదలు గంపెడాసతో ఎదురుచూసిన 2025–26 వార్షిక బడ్జెట్‌లోనూ హామీల అమలుకు కేటాయింపులు చేయకుండా మసిపూసి మారేడుకాయ చేశారు.

**50 ఏళ్లకే పింఛన్‌పై వంచన** : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్ ఇస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచారాల్లో ఎడాపెడా ఊదరగొట్టేశారు. ఇప్పుడు వాటి ఊసెత్తకపోగా విచారణ పేరిట ఉన్న వాటికీ కొర్రీ పెట్టే పనిలో పడ్డారు. జిల్లాలో 50 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు దాదాపు 2.50 లక్షల మంది వరకు ఉండగా వారిలో అర్హులైన వారు 70 శాతం మంది ఉంటారని అంచనా. వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం వారిని నిరాశకు గురిచేస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్నవాటికీ అరకొర కేటాయింపులు అనుమానాలకు తావిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి గతేడాది జూన్‌లో జిల్లాలో పింఛన్ లబ్ధిదారులు 2,34,161 మంది ఉన్నారు. కొత్త మంజూరులు చేయకపోగా వివిధ కారణాలతో 7,075 మంది పింఛన్లను తొల గించారు. దీంతో ఈ సంఖ్య 2,27,086కు తగ్గింది.

**'వల'విల.. మత్స్యకారులు వెలవెల**
వేట విరామం సందర్భంగా మత్స్యకార భృతిని రూ.10 వేల నుంచి రూ. 20 వేల వరకు పెంచుతామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. గతేడాది మత్స్యకారభృతి అందించకపోగా బడ్జెట్‌లోనూ దీనిపై స్పష్టత లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.4 వేలు ఉన్న మత్స్యకార భృతిని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.10 వేలలకు పెంచారు. ఐదేళ్ల పాటు ఏటా మే నెలలో ఈ సాయం అందిస్తూ వచ్చారు. గత టీడీపీ హయాంలో జిల్లాలో కేవలం 76 మంది మాత్రమే అర్హులు ఉండగా జగన్ హయాంలో 1,162 మందికి మేలు చేశారు.

**చేనేతపై చిన్నచూపు** : కూటమి బడ్జెట్‌లో చేనేత రంగాన్ని ఆదుకునే దిశగా అడుగులు వేసిన దాఖలాలు లేవు. చీర–ధోవతి పథకాన్ని పునరుద్ధరిస్తానని, చేనేత ఉత్పత్తులపై 30 శాతం రిబేటు ఇస్తామంటూ హామీలు ఇచ్చినా బడ్జెట్‌లో వాటి ఊసెత్తలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సొంత మగ్గం ఉన్న నేత కార్మికుల కుటుంబాలకు నేతన్న నేస్తం పథకం కింద ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం అందించారు. ఐదేళ్లలో జిల్లాలో 920 కుటుంబాలకు రూ.10.96 కోట్ల లబ్ధి చేకూర్చారు. కూటమి అధికారంలోకి వచ్చాక నేతన్న నేస్తాన్ని నిలిపివేసింది. నేతన్నల కోసం ప్రత్యేక కార్యాచరణ లేకపోవడంతో చేనేత రంగం కుదేలవుతోంది.

### పింఛన్ హామీ ఏమైంది?



**ఎస్సీ, బీసీలకు 50 ఏళ్లకే ఇస్తామన్న పింఛన్ హామీ ఏమైంది. ప్రజలను నమ్మిం**చి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కింది. యాభై ఏళ్లకే బీసీలకు ఫించన్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి మోసం చేసింది. ఇది నమ్మక ద్రోహం.

– పోతురాజు దేవిడ్

### సొమ్ములు ఎగ్గొట్టారు



గత ప్రభుత్వం అందించిన మత్స్యకార భరోసా వేట నిషేధ సమయంలో మాకు ఎంతగానో ఉపయోగపడింది. కూటమి సర్కారు ఈ మొత్తాన్ని మరింత పెంచి ఇస్తామని చెప్పడంతో నమ్మి ఓట్లేశాం. గతేడాది సొమ్ములు ఎగ్గొట్టారు. ఈ ఏడాది కూడా వేస్తారనే నమ్మకం లేదు. ప్రభుత్వానికి గుణపాఠం చెబుతాం.

– మైల వీరాస్వామి, చినమైనవానిలంక

### ఆరోగ్య ఆసరాకు ఎసరు

**ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స** చికిత్స చేయించుకున్న **రోగి కోలుకునే వర**కు భరోసాగా నిలిచే ఆరోగ్య **ఆసరా పథకానికి** బడ్జెట్‌లో కేటాయింపులు **లేవు. సాధారణ** డెలివరీ, సిజేరియన్‌లకు రూ.5 **వేల చొప్పున, రో**డ్డు ప్రమాద బాధితుల్లోని **ఎముకలకు సర్జరీ** కేసులకు రూ.10 వేలు, **కాళ్లకు ఇన్‌ఫెక్షన్** సంబంధించి సెల్యులైటీస్ **కేసులు, కొన్ని** కణుతుల చికిత్సలకు **రూ.1,575, కొన్ని** చెవి, గొంతు, ముక్కు సర్జరీ**లకు రూ.1,275,** గుండె శస్త్రచికిత్సలకు రూ.5 **వేల నుంచి రూ.**10 వేల వరకు.. ఇలా చికిత్స**లను బట్టి రోజు**కు రూ.275లు చొప్పున సాయం లెక్కకట్టి అందించేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య ఆసరా బిల్లులు చెల్లింపు నిలిపివేయడంతో ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు భరోసా కరువైంది.

### ఆక్వాకు దగా

జిల్లాలో ఆక్వా రంగానికి పెద్దపీట వేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఆక్వా రైతులు అందరికీ విద్యుత్ యూనిట్ రూ.1.50కే ఇచ్చి ఆదుకుంటామన్నారు. ఏరియేటర్స్ మీద సబ్సిడీ ఇప్పిస్తామని, అవసరమైన చోట్ల 500 టన్నుల సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తామన్నారు. అయితే బడ్జెట్‌పై ఆయా హామీల అమలుపై స్పష్టత లేదు. జిల్లాలో 1.24 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. 16,019 ఆక్వా విద్యుత్ కనెక్షన్లు ఉండగా వీటిలో పది ఎకరాలకు పైబడిన కనెక్షన్లు 1,142, నాన్‌ఆక్వా జోన్ పరిధిలో 953 ఉన్నాయి. గతంలోనూ రూ.2లకే సబ్సిడీ విద్యుత్‌ను ఇస్తామని టీడీపీ దగా చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పదెకరాలలోపు రైతులందరినీ ఆక్వాజోన్ పరిధిలోకి తీసుకువచ్చి రూ.1.50లకే సబ్సిడీ విద్యుత్‌ను అందజేశారు.

## న్యూస్‌రీల్

### క్షయ ముక్తి భారత్‌గా బల్లిపాడు



టీబీ ముక్తి భారత్ గ్రామంగా బల్లిపాడును ప్రకటిస్తున్న వైద్యాధికారి భానునాయక్ తదితరులు

పాలకొల్లు సెంట్రల్: టిబి ముక్తి భారత్ గ్రామంగా బల్లిపాడు గ్రామాన్ని ప్రకటిస్తున్నట్లు జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాను నాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలో ఉన్న బల్లిపాడు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాను నాయక్ మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో ఈ గ్రామంలో క్షయ వ్యాధి పట్ల సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామంలో నిర్వహించిన పరీక్షల్లో ఒక్క కేసు కూడా నమోదు కాలేదని అన్నారు. అందువల్ల బల్లిపాడు గ్రామాన్ని క్షయ వ్యాధి రహిత గ్రామంగా ప్రకటిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలు బల్లిపాడు గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతీ గ్రామాన్ని క్షయ వ్యాధి రహిత గ్రామంగా తీర్చిదిద్దేలా తమవంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరాజు ఇందిరాదేవి, కాగిత అశోక్, డాక్టర్ అద్దాల ప్రతాప్ కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, జిల్లా టిబి ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి విద్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

### తీరంలో తాబేళ్లు మృతి



నరసాపురం రూరల్: తాబేళ్ల రక్షణ కోసం అధికార యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకున్నా అవి నీటి మూటలే అవుతున్నాయి. ఇటీవల తాబేళ్లు పెద్ద సంఖ్యలో సముద్ర తీరం వెంబడి మృత్యువాత పడిన విషయం మరువక ముందే బుధవారం మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో పలు తాబేళ్లు మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కూడా వీటి మృత్యువాతకు ఒక కారణంగా భావిస్తున్నారు. తాబేళ్ల రక్షణలో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

### మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

భీమవరం(ప్రకాశంచౌక్): మహిళల ఆర్థిక సాధికారిత, భద్రతా, రక్షణ చర్యలో లక్ష్యంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టరు చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం అమరావతి నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.సూర్య కుమారి ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

### ప్రేమ, ఆప్యాయత పంచాలి

భీమవరం(ప్రకాశంచౌక్): కరోనాతో చనిపోయిన కుటుంబాల పిల్లలకు ప్రేమ ఆప్యాయతలను పంచి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరేలా కృషి చేయాలని కలెక్టరు నాగరాణి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేటు పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య స్కీం కింద స్పాన్సర్‌షిప్ ప్రోగ్రాంలో కరోనా బాధిత పిల్లలతో కలెక్టరు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. బాధిత చిన్నారులకు ధైర్యం చెప్పారు.

# మద్యం మత్తులో హత్య



దంతుపల్లిలో హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ప్రేమరాజు, వీరాంజనేయులు మృతదేహం (ఇన్‌సెట్‌లో)

అత్తిలి: పాత గొడవను పురస్కరించుకుని ఇద్దరు స్నేహితుల మధ్య మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి హత్య గురైన ఘటన అత్తిలి మండలం దంతుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు దంతుపల్లి గ్రామానికి చెందిన జుత్తిగ వీరాంజనేయులు (35) కొబ్బరికాయలు దింపుపనికి వెళుతుంటాడు. అదే గ్రామానికి చెందిన కడలి వెంకటేశ్వరరావు అలియాస్ వెంకట నారాయణ, జుత్తిగ వీరాంజనేయులు స్నేహితులు. వీరిద్దరూ కలిసి తరచూ మద్యం సేవిస్తూ ఉంటారు. ఆరు నెలల క్రితం వెంకటేశ్వరరావు కుడి చెవివద్ద వీరాంజనేయులు కత్తితో గాయం చేశాడు. అప్పటి నుంచి వెంకటేశ్వరరావు దీనిపై కక్ష్య పెంచుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఇద్దరూ కలిసి మహంకాళమ్మ ఆలయం వద్ద బల్లపై కూర్చుని మద్యం సేవిస్తుండగా పాతగొడవను పురస్కరించుకుని ఇద్దరూ ఘర్షణ పడ్డారు. దీంతో కడలి వెంకటేశ్వరరావు రాయితో వీరాంజనేయులు తల, ముఖంపై కొట్టి పక్కనే ఉన్న పంట కాలువలో పడవేసి ఇంటికి వచ్చేశాడు. రాత్రి సమయానికి కూడా వీరాంజనేయులు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెంకటేశ్వరరావును నిలదీయగా తానే రాయితో కొట్టి హత్యచేసినట్లు ఒప్పుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు హత్యకు గురైన ప్రాంతానికి చేరుకుని కాలువలో పడి ఉన్న మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా ప్రదేశానికి అత్తిలి ఎస్సై పి ప్రేమరాజు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతునికి భార్య వెంకటలక్ష్మి, ఒక కుమార్తె ఉన్నారు. భార్యభర్తల గొడవలు కారణంగా భార్య రెండేళ్లక్రితం భర్తను వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. మృతుని సోదరి మట్టపర్తి మంగాయమ్మ ఫిర్యాదు మేరకు హత్యకేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి ప్రేమరాజు తెలిపారు.

## అభివృద్ధి పనుల కొనసాగింపులో జాప్యం



శాసనమండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: శాసన మండలిలో బుధవారం ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌లు సద్వినియోగం చేసుకోవడంలో పరిశ్రమల శాఖకు చెందిన ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) తీవ్ర జాప్యం చేస్తోందని, ఎంఎస్‌ఎంఈ నిధులతో మొదలుపెట్టిన అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయని అన్నారు. తణుకు, నెల్లిమర్ల, గాజులమండ్యం పారిశ్రామిక వాడలో రూ. 36 కోట్ల అభివృద్ధి పనులు ఆగిపోయాయని వాటిని త్వరితగతిన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. తాను లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి భరత్ సమాధానం ఇస్తూ కొంత జాప్యం జరిగిందని, ఇక నుంచి అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పశ్చిమ గోదావరి డెల్టా పరిధిలోని మంచినీటి కాలువలలోకి పంచాయతీ వ్యర్థాలను వదులుతున్నారని, సిద్ధాంతం, పెనుగొండ, నర్సాపురం భీమవరం జీవీ కాలువల్లో వేస్ట్ వాటర్‌ను నేరుగా పైపుల ద్వారా కలిపేస్తున్నారని చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు.

## నూరు శాతం పన్నులు వసూలు చేయాలి




పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశంచౌక్): అన్ని పంచాయితీల్లో మార్చి నెలాఖరు నాటికి నూరు శాతం పన్నులు వసూలు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం భీమవరం శ్రీ విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో పంచాయతీ కార్యదర్శుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూరు శాతం పన్నులు వసూలుతో పాటు పూర్తిగా ప్లాస్టిక్ నిషేధించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి రోడ్డు పక్కన చెత్త కనిపించకూడదన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి వర్మి కంపోస్ట్ చేయాలన్నారు. నూరు శాతం పన్నులు వసూలు చేసిన కోమటితిప్ప, మొగల్తూరు, పాలకోడేరు, కొత్త నవరసపురం, మైప, వేంద్ర అగ్రహారం, చింతపర్రు, జగన్నాధపురం, మినీమించిలిపాడు, తూర్పుపాలెం, పి.పోలవరం, అప్పన్న చెరువు, వద్దిపర్రు, తోకలపూడి, దరిసిపరు, అప్పారావుపేట, కృష్ణయ్యపాలెం గ్రామాల కార్యదర్శులకు మెమొంటోలు అందజేశారు.

## నేడు వైన్ షాపులకు లాటరీ

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో గీత కులాలకు కేటాయించిన 18 రిజర్వేషన్ వైన్ షాపులకు గురువారం కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 3 గంటలకు లాటరీ ద్వారా షాపులు కేటాయిస్తారని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకోవాలని కోరారు. ప్రతి దరఖాస్తుదారుడు దరఖాస్తుతోపాటు ఎంట్రీ పాస్, కుల ధ్రువీకరణ సర్టిఫికేట్, ఆథరైజేషన్ లెటర్ తీసుకుని రావాలన్నారు. మద్యం షాపు దక్కించుకున్న వెంటనే లైసెన్స్ రుసుం చెల్లించాలన్నారు.

# తణుకులో చికెన్ మేళా



తణుకులో చికెన్, ఎగ్ మేళాలో వంటకాలు వడ్డిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు అర్బన్ : తక్కువ ధరతో ఎక్కువ ప్రొటీన్ అందించే చికెన్, కోడిగుడ్లు తీసుకోవడంలో అపోహలు అవసరం లేదని కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. తణుకు నెక్ కల్యాణ మండపంలో బుధవారం పౌల్ట్రీ ఫెడరేషన్, జిల్లా కోళ్ల రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చికెన్, ఎగ్ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. బర్డ్‌ఫ్లూ సంక్షోభం ఏర్పడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని నేడు ఆ పరిస్థితులు తొలగిపోయాయని ప్రజలు నిరభ్యంతరంగా చికెన్, కోడిగుడ్లు తీసుకోవచ్చని స్పష్టం చేశారు. చికెన్ తినడం వలన ఎటువంటి ఇబ్బందులు రావని చెప్పారు. బాగా ఉడికించి చికెన్ తింటే ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ కోళ్ల రైతుల రుణాలు రీషెడ్యూల్ చేయాలనే అభ్యర్థనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. చికెన్, ఎగ్ మేళాకు విశేష స్పందన వచ్చింది. పౌల్ట్రీ ఫెడరేషన్ చైర్మన్ కోమట్లపల్లి వెంకట సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో నెక్ చైర్మన్ మల్లిన శ్రీనివాసరావు, ఆర్డీవో కౌసర్ బానో, పశుసంవర్ధకశాఖ అధికారి కె.మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపురంలో పంచాయతీ స్థలం స్వాహా

**తన భార్య పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్న టీడీపీ నేత**



పంచాయతీ స్థలానికి సర్వే చేసి రాళ్లు వేయిస్తున్న సర్వేయర్లు

ఉంగుటూరు : ఆక్రమణకు కాదేది అనర్హం అన్న చందంగా తయారైంది కూటమి ప్రభుత్వంలో పరిస్థితి. కన్ను వేశారా అంతే హాంఫట్.. ఉంగుటూరు మండలం నారాయణపురంలో జాతీయరహదారిని ఆనుకుని గ్రామ పంచాయతీకి చెందిన ఆరు సెంట్ల స్థలాన్ని టీడీపీ తన పేరున ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. సర్వే నెంబరు–156/2లో ఉన్న ఈ స్థలాన్ని టీడీపీ నేత గంటా యువరాజు తన భార్య పేరున పంచాయతీ స్థలం సరిహద్దులతో 156/1 సర్వే నెంబరుతో ఇటీవల గిఫ్ట్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేయించారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తి అని, తండ్రి తనకు రాశారని రిజిస్ట్రేషన్ పత్రాల్లో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులు ఉలిక్కిపడ్డారు. పంచాయతీ కార్యదర్శి విజయ్ తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ నకళ్లు తీసుకున్నారు. చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో మంగళవారం పంచాయితీ కార్యదర్శి ఫిర్యాదు చేశారు. ఆ పంచాయితీ స్థలానికి సర్వే చేయించి హద్దులు నిర్ణయించి రాటలు పాతారు. ఫెన్సింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.పంచాయతీకి చెందిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయంపై పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టామని కార్యదర్శి తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి రద్దు చేయిస్తామని విజయ్ తెలిపారు. ఈ స్థలం మార్కెట్ విలువ రూ.కోటి ఉంటుందని అంచనా.

**గూడెం రిజిస్ట్రార్ కార్యాలయంలో గోల్‌మాల్**
ఈ స్థలాన్ని తప్పుడు సర్వే నెంబరుతో ఎలా రిజిస్ట్రేషన్ చేశారనేది ప్రశ్న. ఈ వ్యవహారంలో తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరి హస్తం ఉండొచ్చంటున్నారు. రిజిస్ట్రేషన్ చేసిన 90 రోజుల వ్యవధిలో సర్వే నెంబరు తప్పుగా నమోదైందనే వంకతో ప్రభుత్వ భూమిని కాజేయలనేది ఆ నాయకుడు ఎత్తుగడ. ఈ భూమిని మరో వ్యక్తికి గత నెల 12న తనఖా రిజిస్ట్రేషన్ కూడా చేశారు.

# మట్టి మాఫియాతో సాగునీటికి అడ్డంకులు

**పెంటపాడులో యంగం చెరువు ఆయకట్టు రైతుల ఆందోళన**





గూడెం పట్టణంలో కన్వర్షన్ లేకుండా పూడిక చేస్తున్న స్థలం, చేలను మట్టి కోసం తవ్విన వైనం

తాడేపల్లిగూడెం: అధికారం ముసుగులో రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి 500 ఎకరాలను ఎండగట్టేందుకు కొందరు నేతలు సిద్ధమయ్యారు. పెంటపాడులో యంగం చెరువు ఆయకట్టు కింద సుమారు 500 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఈ ప్రాంతంలో వ్యవసాయ క్షేత్రాన్ని ఆనుకొని వేసుకున్న గట్లు, ఉమ్మడి కళ్లాలు ఉన్నాయి. మిడ్ లెవల్ కాలువ నుంచి లో లెవల్ కాలువను అనుసంధానించడానికి ప్రధాన పంట బోదెలు పెంటపాడు నుంచి జట్లపాలెం వరకు ఉన్నాయి. ఈ ప్రధాన భూముల మీదుగా సాగు నీరు పంటబోదెల ద్వారా లో లెవల్ కాలువకు వెళ్తుంది. ఈ మార్గంలో సుమారు 500 ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. కొందరు స్వార్థపరులు అధికారం ముసుగులో మట్టి తవ్వకాలకు తెగబడ్డారు. నియోజకవర్గ మట్టి మాఫియా లీడర్ బుల్‌డోజర్లు, పొక్లెయిన్‌లు యథేచ్ఛగా మట్టిని తవ్వి పెంటపాడు నుంచి గూడెం పట్టణానికి తరలించారు. దీంతో ఈ తవ్వకాలను రైతులు అడ్డుకున్నారు. తమ భూములకు సాగునీటి సరఫరాకు అడ్డంకులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ తర్వాత తెరపైకి వచ్చిన కూటమి నేత మట్టి తవ్వకాలను కొనసాగించాలని, యంత్రాలను సీజ్ చేయకుండా మంతనాలు సాగించినట్టు సమాచారం.

సుమారు 500 ఎకరాలకు సాగునీరు అందించే పంట బోదెలు, సామూహిక కళ్లాలు, గట్లను విధ్వంసం చేసేలా సాగుతున్న మట్టి తవ్వకాల కారణంగా సాగునీరు అందకుండా పొలాలు బీడు వారే ప్రమాదం ఉంది. రెవిన్యూ అధికారులు తవ్వకాలను ఎందుకు ఎందుకు అడ్డుకోలేదు.. వాహన యజమానులపై ఎందుకు కేసు నమోదు చేయలేదన్నది ప్రశ్నార్థకం. ఈ వ్యవహారంపై పెంటపాడు సంగం మేడ వద్ద జరిగిన మంతనాలకు గూడెం జేఎస్పీ నేత వెళ్లారు. పెంటపాడు రెవెన్యూ అధికారి ఆరోగ్య పరమైన కారణాలతో సెలవు పెట్టి వెళ్లగా.. ఇన్‌చార్జిగా ఒక అధికారిని నియమించారు. దీని వెనుక పెద్ద తతంగా నడిచిందని సమాచారం. ఇన్‌చార్జి అధికారులు తూతూ మంత్రం చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారు.

### భూమి పూడికకు అనుమతి లేదు

పట్టణంలో భీమవరం బైపాస్ రోడ్డులో జిరాయితీ భూమిని పూడుస్తున్నారు. ఈ భూమికి సంబంధించి భూ యజమానులు కన్వర్షన్ అనుమతి పొందలేదు. ఇలా చేయడం నేరం. మార్గదర్శకాల ప్రకారం పూడిక చేసుకుంటే జరిమానా చెల్లింపుతోపాటు, కన్వర్షన్ ఫీజు కూడా చెల్లించాల్సి ఉంది. ఇలాంటి చర్యలను నిబంధనల మేరకు అడ్డుకుంటాం.

– సునీల్‌కుమార్, తహసీల్దార్, తాడేపల్లిగూడెం

## క్లుప్తంగా

### భవిత సెంటర్‌లో మహిళలకు ఆటల పోటీలు



భవిత సెంటర్‌లో మహిళలకు ఆటల పోటీలు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8వ తేదీన పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్,పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ మురళీకృష్ణంరాజు సౌజన్యంతో బుధవారం స్థానిక భవిత దివ్యాంగుల కేంద్రం ఆవరణలో దివ్యాంగుల పిల్లల తల్లులకు క్యారం బోర్డ్, స్కిప్పింగ్, త్రోబాల్, సింగింగ్, డ్రాయింగ్ ఆటల పోటీలు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతి పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు మహిళలను నిరంతరం గౌరవించాలని, ప్రోత్సాహం అందించాలని తెలిపారు. త్వరలో విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

### బాల్య వివాహాలు నేరం



బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం రూరల్:** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, యుక్త వయస్సు వచ్చిన తర్వాతే వివాహాలు చేయాలని మహిళా సంరక్షణ కార్యదర్శి హుస్సేన్ భాను సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని ఆరుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు కెరీర్ గైడెన్స్, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హుస్సేన్ భాను మాట్లాడుతూ బాలికలు తప్పనిసరిగా చదువుకోవాలన్నారు. తద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జి. సూర్యనాగలక్ష్మి, బి.రాణి, షేక్ కాజా బీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వంతెన ఎక్కిన మొక్కలు

**బ్రిడ్జి శిథిలం కాకుండా చూడాలి**

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** కొన్ని పనులు తక్షణమే చేయకపోవడం వల్ల అవి ఏకు మేకై కూర్చుంటున్నాయి. అధికారుల అ లక్ష్యం వల్ల ప్రభుత్వం సైతం భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని ప్రజలు అంటున్నారు. దీనికి నిదర్శనమే పట్టణంలో వన్ టౌన్ నుంచి టూ టౌన్‌కు, స్థానిక ఏలూరు కాలువ, రైల్వే ట్రాక్‌లు మీదుగా కలుపుతూ గతంలో మొదటి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించారు. బ్రిడ్జి పైన, పిల్లర్స్‌పైన, సైడ్ శ్లాబు అంచులలోను రావి, మర్రి మొక్కలు మొలవడం. ప్రస్తుతం అవి పెద్దవి అవుతున్నాయి. రానున్న రోజులలో అవి వృక్షాలుగా మారే అవకాశాలు కానవస్తున్నాయి. ఎంతో ప్రాముఖ్యత కలిగిన, ఎంతో ప్రాధాన్యత కలిగిన బ్రిడ్జి మీద మర్రి, రావి మొక్కలు మొలుస్తున్న ఎవరూ పట్టించుకోక పోవడం శోచనీయం అంటున్నారు. ప్రతి రోజు మొదటి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వేల వాహనాలు ప్రయాణం చేస్తు ఉంటాయి. ప్రభుత్వ అధికారులు ఈ వంతెన పై నుంచి ప్రయాణం చేస్తూ ఉంటారు. అయినప్పటికి సంబంధిత అధికారులు వాటిని చూసి చూడనట్లు అలానే వదలివేయడం వల్ల అవి పెరిగి పెద్దవి అయ్యి వంతెనకు పగుళ్లు వచ్చే విధంగా చేస్తున్నాయి. బీటలు వారుతున్నాయి. మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తే అవి వృక్షాలుగా మారే అవకాశం ఉండదని, వంతెన ధ్వంసం అయే ప్రక్రియ ఆగుతుందని, లేని పక్షంలో వంతెన శిథిలావస్థకు చేరుకునే అవకాశాలు కానవస్తున్నాయి. గతంలో ఈ విధంగా మొక్కలు మొలిచిన సమయంలో వంతెన బీటలు వారిని సమయంలో అప్పటి మాజీ ఎమ్మెల్యే ఈలి నాని బ్రిడ్జికు మరమ్మతులు చేపట్టారు. అదేవిధంగా దాతలు సైతం బ్రిడ్జిపైన మొక్కలను తొలగించేందుకు కృషి చేశారు. నేడు తిరిగి మొక్కలు మొలవడం, వృక్షాలు కావడం జరిగితే బ్రిడ్జి తిరిగి శిథిలమవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని మొక్కలను తొలగించి బీటలను పూడాల్సిన అవసరం ఎంతైన ఉందని, మరమత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



తాడేపల్లిగూడెంలో మొదటి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మొక్కలు

**వంతెనపై మొక్కలను తొలగించాలి**


ఫ్లైఓవర్ వంతెనపై మొలిచిన మర్రి, రావి మొక్కలను తొలగించాలి. లేకపోతే అవి వృక్షాలుగా మారుతాయి. వంతెన శిథిలమవుతుంది. అధికారులు స్పందించి మొక్కలను తొలగించడంతో పాటు బీటలు వారిని వంతెన మరమ్మతులు చేపట్టాలి.
– అలమండ మురళీ, మెకానిక్

### దోమకాటు వ్యాధులపై అవగాహన అవసరం


సబ్‌యూనిట్ ఆధ్వర్యంలో హెల్త్ సిబ్బందిచే ర్యాలీ

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** దోమకాటు వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వీకర్స్ కాలనీ, ఎన్టీఆర్ జంక్షన్ పరిధిలో 3, 4, 10 వార్డుల్లో బుధవారం జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు జరిగాయి. ఆరోగ్య అవగాహన, క్షేత్రస్థాయి పరిశీలనలు, ర్యాలీలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికి ఒక్కసారి డ్రై డే పాటించడం ద్వారా దోమలను అరికట్టవచ్చునని తెలిపారు. ప్రజలు తప్పక పారిశుద్ధ్య సిబ్బందికి, ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సరళ, సౌజన్య, మేరీ, ఆశాలు రత్నకుమారి, ప్రశాంతి, రమణ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

### యూనియన్ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోండి

**తణుకు అర్బన్:** భారత ప్రభుత్వ వికసిత్ భారత్ ధృక్పథానికి అనుగుణంగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా వారం రోజుల పాటు మెగా ఎంఎస్ఎంఈ అవుట్‌రీచ్ క్యాంపెయిన్‌లను నిర్వహిస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ పి.సంగీత కుమారి అన్నారు. తణుకు వీకే ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హులైన రుణగ్రహీతలకు రూ. 20.16 కోట్లు రుణాలు మంజూరు చేసి పత్రాలు అందించామన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు యు. మంగపతి రావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజరు జి.ఎస్.వి.రమణ పాల్గొన్నారు.


చెక్కు నమూనా ఆవిష్కరించిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

### ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం టౌన్, పెంటపాడులలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. టౌన్‌లోని శ్రీ వాసవి, ఆదిత్య, జీఎంఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీఆర్ గోయెంకా ఉమెన్స్ జూనియర్ కళాశాలలోను, అదే విధంగా పెంటపాడు జూనియర్ కళాశాలలో బుధవారం ద్వితీయ సంవత్సరం ఇంగ్లీషు–2 పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. 2010 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 1988 మంది పరీక్షలకు హాజరయ్యారు. 22 మంది పరీక్షలు రాయలేదు. ఛీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌లు పర్యవేక్షించారు.

### పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సుబ్బారావుపేట అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం పౌష్టికాహారం లోపంతో ఉన్న పిల్లల తల్లిదండ్రులతో సమావేశం జరిగింది. తొలుత పిల్లలు ఎత్తు, బరువులు కొలిచారు. పిల్లల పోషణ స్థితిని తల్లిదండ్రులకు తెలియజేశారు. అంగన్‌వాడీలో ఇచ్చే పౌష్టికాహారం తీసుకుని, పిల్లలకు అందజేయాలని పలు సూచనలు చేశారు. టీచర్ సత్యవతి, మహిళా పోలీస్ సీహెచ్ ప్రశాంతి పాల్గొన్నారు.

### విద్యా సామగ్రి పంపిణీ

**తణుకు అర్బన్:** వసతి గృహాల్లో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేయడం అభినందనీయమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ అన్నారు. తణుకు బీసీ హాస్టల్‌లో ఆల్ ఇండియా పుల్ అంబేడ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పొట్ల సురేష్ సౌజన్యంతో పరీక్ష సామగ్రిని అందజేశారు.

### కొనసాగుతున్న త్యాగరాజు స్వామి ఆరాధనోత్సవాలు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** త్యాగరాజు స్వామి వారి 84వ ఆరాధనోత్సవాలు సందర్భంగా పట్టణంలోని బీవీఆర్‌లో బుధవారం రాత్రి సంగీత కచేరీ జరిగింది. స్వర్గీయ అమ్మనమంచి బలరామ శాస్త్రి, వెంకటేశ్వర్లు కళా వేదిక పై వల్లూరి తుషార పూర్ణవల్లి (విజయవాడ) వారి గాత్ర కచేరి నిర్వహించగా వయొలిన్‌పై కురపాటి సుబ్రహ్మణేశ్వరరాజు (విజయవాడ), మృదంగం పై పలివెల విద్యాసాగర్ (హైదరాబాద్), ఘటంపై బి.మారుతి రఘురాం (తిరుపతి)లు సహకరించారు. కళా కేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు, త్యాగరాజు గాన సభ అధ్యక్షులు గరికిపాటి బాపయ్య శర్మలు పర్యవేక్షించారు. కళాకారులు, సాహితీ సభ్యులు, త్యాగరాజు స్వామి భక్తులు పాల్గొన్నారు.

### బాలికలు జీవితంపై దృష్టి సారించాలి

**తాడేపల్లిగూడెం రూరల్:** బాలికలు జీవితంపై దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి అన్నారు. బుధవారం మండలంలోని పెదతాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జీవిత అవకాశాలు, ఒత్తిడిని అధిగమించడం, జీవితంపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్తేరు రాణి మాట్లాడుతూ బాలికలు సోషల్ మీడియా ప్రకటనలపై ఆసక్తి తగ్గించి, విద్యపై దృష్టి సారించాలన్నారు. చదువు ద్వారానే జీవితంలో ఉన్నత అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రధానోపాధ్యాయురాలు లాల్ బీ మాట్లాడుతూ సోషల్ మీడియా దుష్ప్రభావాలు, నష్టాలపై విద్యార్థులకు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, రామలక్ష్మి, సుధ తదితరులు పాల్గొన్నారు.





### దళితసేన మహాధర్నాను జయప్రదం చేయండి

**తాడేపల్లిగూడెం రూరల్:** డప్పు కళాకారులు, చర్మకారుల సమస్యలపై మే 5వ తేదిన ఉదయం 10 గంటలకు ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని చినతాడేపల్లి దళిత సేన కార్యాలయంలో జిల్లా కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ డప్పు కళాకారులు, చర్మకారులకు పెన్షన్ రూ.6వేలకు పెంచాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లిడ్ క్యాప్ ద్వారా డప్పు, చర్మకారులకు సబ్సిడీ రుణాలు ఇప్పించాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీలు పూర్వం నుంచి నేటి వరకు సాగు చేసుకునే సాగు భూములైన బండిదారి భూములు, గయ్యాలి భూములు, మెట్ట భూములు, అటవీ భూములకు సాగు పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పరిరక్షించాలన్నారు. ఈ సమస్యలపై ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు వివరించారు. డప్పు, చర్మకారులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. దళిత సేన రాష్ట్ర కార్యదర్శి షేక్ సయ్యద్ బాజీ, తాడేపల్లిగూడెం నియోజకవర్గ అధ్యక్షుడు దూలపల్లి సత్తయ్య, మండల అధ్యక్షుడు కిలాడి రవి, మండల యూత్ అధ్యక్షుడు రాజేంద్ర, ప్రేమ్‌కుమార్ తదిరులు పాల్గొన్నారు.


చినతాడేపల్లిలో జరిగిన దళిత సేన జిల్లా కార్యకర్తల సమావేశ దృశ్యం

### పాడి పశువులకు టీకాలు వేయించాలి

**తాడేపల్లిగూడెం రూరల్:** రైతులు తమ పాడి పశువులకు విధిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ టీవీ.విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని బంగారుగూడెం, అప్పారావుపేట గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ గాలికుంటు టీకాలు వేయించాలని, లేకుంటే నోటిలో పుండ్లు, గిట్టలకు, పొదుగుపై పుండ్లు వచ్చి పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు. పశువులకు నిరంతరం చొంగ కారడం, అధిక ఉష్ణోగ్రతతో బాధపడతాయన్నారు. నాలుగు నుంచి ఎనిమిది నెలల పెయ్యి దూడలకు భవిష్యత్‌లో గర్భస్రావం కాకుండా బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాలు వేయించాలన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అనంతరం బంగారుగూడెంలో 147 ఆవులు, 256 గేదెలు, అప్పారావుపేటలో 450 పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో జేవీవో హేమలత, పశుసంవర్ధక శాఖ సహాయకులు గౌతమి, అనిల్, ప్రసాద్, శ్రీనివాస్, మురళీ తదితరులు పాల్గొన్నారు.


బంగారుగూడెం గ్రామంలో ఆవులకు టీకాలు వేస్తున్న దృశ్యం

### శ్మశాన వాటిక ప్రహరీకి సర్పంచ్ శంకుస్థాపన

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని ఆరుగొలను గ్రామంలోని ఎస్సీ శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ పీతల బుచ్చిబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటిక రక్షణ నిమిత్తం ఈ గోడ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్డీయే దళిత సభ్యులు మలకా వెంకట్రావు, ఎం.గాంధీ, జి.మూర్తి, శీరా వెంకటేశ్వరరావు, పిట్టా వెంకటేశులు, ఎస్. శ్రీను, ఎం.డేవిడ్ రాజు, కూటమి నాయకులు వి.రాంబాబు, అడపా వెంకన్నబాబు, రామానాయుడు, రవి, రాజేష్, చిరంజీవి, రెవ.డేవిడ్ పాల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### మద్యం షాపుల లాటరీ కేటాయింపులో పాల్గొనండి


ఈ.స్వరాజ్యలక్ష్మి

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** గీత కులాలకు కేటాయించిన మద్యం షాపులను లాటరీ ద్వారా కేటాయింపులు ఈ నెల 6వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయం భీమవరంలో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ హాల్‌లో జరుగుతాయని తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఈ.స్వరాజ్యలక్ష్మి వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ దారఖాస్తు చేసుకొన్న వారు వారికి ఇవ్వబడిన ఎంట్రీ పాస్‌లతో ఒక గంట ముందు వేదిక వద్దకు చేరుకోవాలన్నారు. లాటరీలో షాప్ పొందిన వారు మొదటి విడత లైసెన్స్ ఫీజును అదే రోజు సాయంత్రం చెల్లించి లైసెన్స్ పొందాలని ఆమె వివరించారు.









## సాక్షి క్లాసిఫైడ్స్



**గమనిక**

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION)**
**TADEPALLIGUDEM**
**I.P.No.6/2025**

Between:
**Rudra Dileep Kumar** ...Petitioner
And
1. **Katreddy Venkata Subba Rao**
2. **Sagiraju Jai Ganesh Varma**
3. **Sagiraju Nilima**
4. **The Official Receiver** ...Respondents

To,
**1st Respondent :**
**Katreddy Venkata Subba Rao**, S/o **Goplam**, Door No.3-48, Satyanarayanapuram, Adavikolanu village, Nidamarru Mandalam, West Godavari District, TPG SCJ.
**2nd Respondent :**
**Sagiraju Jai Ganesh Varma**, S/o **Subba Raju**, Door No.1-13-11/B-5, Tirumalasai Enclave-4, Cosmo club Road, Bhimavaram, Bhimavaram Mandalm, West Godavari District, BVRM SCJ.
**3rd Respondent :**
**Sagiraju Nilima**, W/o **Jai Ganesh Varma**, Door No. 1-13-11/B-5, Tirumalasai Enclave-4, Cosmo club Road, Bhimavaram, Bhimavaram Mandalm, West Godavari District, BVRM SCJ.
**4th Respondent :**
The Official Receiver, Eluru, West Godavari District, Eluru.

**NOTICE**

Please take notice that the Petitioner filed the above Creditor Insolvency petition against you for adjudicate the 1st respondent as insolvent and to Set-a-side documents Nos.7741/2024 and 7742/2024 executed by the 1st respondent in favour of the 2nd and 3rd respondents i.e., No.2 and No.3 of You and for administration of debts of the 1st respondent including the debt of the petitioner under the promissory note dated 10-01-2024 executed by the 1st respondent in favour of the petitioner for an amount of Rs.20,00,000/- i.e., petition B schedule property. The Honourable court ordered to made publication to you through the Sakshi News paper, Tadepalligudem. So, you are all here by directed to appear before the Honourable court at 10-30 A.M on 18-03-2025 to which date the above creditor insolvency petition stands posted either in person or through an advocate and file your counters if any regarding the objections to the petition, If you are failed to appear before the Honourable court at 10-30 A.M on 18-03-2025 the petition will be decided in your absence.

(By order of the court)
**K.MANI KUMAR,**
Advocate for Petitioner,
Tadepalligudem.

### స్త్రీ విద్య సమాజ అభివృద్ధికి దోహదపడుతుంది

**తణుకు అర్బన్:** స్త్రీ విద్య సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని రాజమండ్రి సీఐడీ అడిషినల్ ఎస్పీ ఆస్మా ఫర్హీన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ఆవరణలో గుడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్, నేర పరిశోధన విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ఆడ, మగ సమానమేనని, స్త్రీలు భర్తకు కృతజ్ఞతగా మెలగాలని వంటింటికే పరిమితం కాకూడదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి ఆరిమిల్లి తులసి మాట్లాడుతూ నేటి ఆధునిక మహిళ ఇంటి బాధ్యతలతోపాటు విద్య, వైద్య, రాజకీయ రంగాల్లో నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా మహిళలు డిజిటల్ టెక్నాలజీపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం అడిషినల్ ఎస్పీ ఆస్మా ఫర్హీన్‌ను ఘనంగా సత్కరించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, చిట్టూరి రీనాసాయి, ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీబాయి, గుడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధి వి.ఆశాజ్యోతి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, డాక్టర్ కేవీ వందన, కె.వైశాలి, విద్యార్థినులు పాల్గొన్నారు.


తణుకులో సీఐడీ అడిషినల్ ఎస్పీ ఆస్మా ఫర్హీన్‌ను సత్కరించిన దృశ్యం

### 9న ఉమ్మడి పశ్చిమ జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

**తణుకు అర్బన్:** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సబ్ జూనియర్ బాలుర బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు మార్చి 9వ తేదిన తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి అప్పలరాజు, యలమరెడ్డి శ్రీకాంత్ తెలిపారు. 16 సంవత్సరాలలోపు వయస్సు, 55 కేజీలు లోపు బరువు ఉన్న క్రీడాకారులు ఈ ఎంపికలకు అర్హులని, ఉదయం ఎనిమిది గంటలకు పుట్టినతేది ధ్రువపత్రం, ఆధార్ కార్డుతో సెలక్షన్ ఆర్గనైజర్ సంకు సూర్యనారాయణకు రిపోర్ట్ చేయాలని వివరించారు. వివరాలకు 9989363978 నంబరులో సంప్రదించాలని కోరారు. మార్చి 14 నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.